క్లుప్తంగా

ఇంద్రకీలాద్రిలో ఎమ్మెల్యే పూజలు



కనకదుర్గమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: ఇంద్రకీలాద్రిలో బెజవాడ కనకదుర్గమ్మకు ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండేలా దీవించమని ఎమ్మెల్యే అమ్మవారిని వేడుకున్నారు.

ఘనంగా గంగమ్మ పండగ

బాడంగి: మండల కేంద్రంలో గంగమ్మ పండగ ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా యాదవుల కులానికి చెందిన నీలబోను కుటుంబ సభ్యులు ఈ పండగ చేయగా, ఆ కులానికి చెందిన వారంతా తమ కులదైవమైన గంగమ్మకు విశేష పూజలు చేస్తున్నారు. గొర్రెపోతును అమ్మవారికి బలి ఇచ్చి, మొక్కులు తీర్చుకున్నారు. ప్రతిరోజూ మధ్యాహ్నం బంధుమిత్రులతో సహపంక్తి భోజనాలు చేస్తూ ఆనందంగా గడుపుతున్నారు. బుధవారంతో పండగ ముగుస్తుందని గ్రామ పెద్దలు తెలిపారు.

క్రీడాకారునికి సత్కారం



అపర్ణబాబును సన్మానిస్తున్న నేతలు

బొబ్బిలి: స్థానిక పట్టణంలో పట్టణానికి చెందిన బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కోట అపర్ణబాబును మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు కలిసి మంగళవారం సత్కరించారు. ఇటీవల ప్రొద్దుటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన నేపథ్యంలో ఆయనను సన్మానించారు. భవిష్యత్‌లో మరిన్ని టోర్నీల్లో పాల్గొని, బొబ్బిలికి మంచి పేరు తీసుకురావాలని నేతలు ఆకాంక్షించారు. అనంతరం అపర్ణబాబుకు రూ.20 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ జేసీఎస్ ఇన్‌చార్జ్ రేజేటి ఈశ్వరరావు(విసు), మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సుంకర సాయిరమేష్ తదితరులు పాల్గొన్నారు.

చకచకా సీసీ రోడ్డు పనులు



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణారావు

బొబ్బిలి: పట్టణ పరిధిలోని మల్లంపేటలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చకచకా జరుగుతున్నాయి. మంగళవారం నిర్మాణ పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని ఆయన అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పార్వతి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను బకాయిల వసూళ్లకు చర్యలు తీసుకోండి



మారుతీనగర్‌లో ఆస్తిపన్ను వసూలుపై ఆరాతీస్తున్న మున్సిపల్ కార్యాలయ మేనేజర్ నాగరాజు

రాజాం: ఆస్తిపన్ను బకాయిల వసూళ్లకు చర్యలు తీసుకోండి అని మున్సిపల్ కార్యాలయ మేనేజర్ ఎంవీ నాగరాజు సూచించారు. మంగళవారం స్థానిక పట్టణంలోని మారుతీనగర్‌లో ఆస్తిపన్ను వసూళ్లపై ప్రచారం నిర్వహించారు. పన్ను చెల్లించని వారంతా కాలయాపన చేయకుండా సకాలంలో పన్నులు చెల్లించి, ప్రభుత్వ అభివృద్ధి పనులకు తోడ్పాటునందించాలని కోరారు.

పౌష్టికాహారంతో గర్భిణులకు ఆరోగ్యం

విజయనగరం ఫోర్ట్: గర్భిణులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రోగ్రాం మేనేజర్ పి.బాలాజీ అన్నారు. స్థానిక ఏఆర్‌టి కేంద్రంలో గర్భిణులకు పౌష్టికాహార కిట్లును మంగళవారం సాతి సంస్థ అందజేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమం తప్పకుండా వైద్య తనిఖీలు గర్భిణులు చేయించుకోవాలన్నారు. ప్రసవం అయ్యే వరకు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు. వైద్యుని సలహా లేకుండా ఎటువంటి మందులు వాడకూడదన్నారు. గర్భిణులు అందరు హెచ్ఐవీ పరీక్షలు చేయించుకోవాలన్నారు. హెచ్ఐవీ సోకిన వారు ఏఆర్‌టీ మందులు వాడాలని తెలిపారు.

నులిపురుగులను నులిమేద్దాం!

- నులిపురుగు నివారణ మాత్రల పంపిణీలో వక్తలు
- పాఠశాలల్లోని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు



రాజాం: కొత్తవలస పాఠశాలలో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్న హెచ్ఎం తిరుమలరావు



రేగిడి: విద్యార్థుల నోటిలో డీవార్మింగ్ మాత్రలు వేస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి అసిరినాయుడు



బొబ్బిలి రూరల్: సీహెచ్ బొడ్డవలసలో డీవార్మింగ్ మాత్రల పంపిణీలో వైద్యారోగ్య సిబ్బంది



రాజాం సిటీ: విద్యార్థులకు చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

సంతకవిటి: మండలంలోని మందరాడ గ్రామంలో ఉన్న జెడ్పీ ఉన్నత పాఠశాలలో నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా వైద్యారోగ్య సిబ్బంది ఆల్బెండజోల్/డీవార్మింగ్ మాత్రలను విద్యార్థులతో వేయించారు. మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత ఒకటి, రెండు తరగతుల పిల్లలు సగం మాత్ర(హాఫ్ టాబ్లెట్), మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు మొత్తం మాత్ర(ఫుల్ టాబ్లెట్) వేశారు. 19 ఏళ్లలోపు వయసు వారంతా వీటిని వేసుకుని, నులిపురుగుల నివారణకు తోడ్పడాలని పీహెచ్‌సీ వైద్యాధికారి నాగేంద్రప్రసాద్, ఎంపీడీఓ ఎస్.రఘునాధాచారి కోరారు. అనంతరం చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సంతకవిటి: విద్యార్థికి ఆల్బెండజోల్ మాత్రలు అందజేస్తున్న ఎంపీడీఓ రఘునాధాచారి

రాజాం: మండలంలోని కొత్తవలస యూపీ పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలు(ఆల్బెండజోల్) వేశారు. రాజాం అర్బన్ ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారిణి అనూష, ఏఎన్ఎం పి.మల్లీశ్వరి హెచ్ఎం కుదమ తిరుమలరావు పర్యవేక్షణలో విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు వేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటలక్ష్మి, నాగేశ్వరరావు, తిరుమలసురేష్‌కుమార్ పాల్గొన్నారు.

రేగిడి: స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు డీవార్మింగ్ మాత్రలు పంపిణీ చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి జి.అసిరినాయుడు మాట్లాడుతూ మన పరిసరాల్లో నులిపురుగుల వ్యాప్తిని తగ్గించడం ద్వారా సమాజానికి ప్రయోజనం చేకూరుతుందన్నారు. చాలామంది పిల్లల్లో నులిపురుగులు ఉన్నా లక్షణాలు బయటకు కనిపించవన్నారు. నులిపురుగుల వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. బూరాడ పీహెచ్‌సీ పరిధిలోని పలు పాఠశాలల విద్యార్థులతో వైద్యాధికారిణి గట్టి భార్గవి డీవార్మింగ్ మాత్రలు వేయించారు.

బొబ్బిలి రూరల్: మండలంలోని గోపాలరాయుడిపేట, సీహెచ్ బొడ్డవలస గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లోని చిన్నారులకు నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ చేశారు. వీటిని ఎలా వాడాలో, వాడిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యారోగ్య సిబ్బంది విద్యార్థులకు వివరించారు.

95 శాతం పంపిణీ..

రాజాం సిటీ: మండలంలోని బొద్దాం, పొగిరి పీహెచ్‌సీల పరిధిలోని పాఠశాలల చిన్నారులకు 95 శాతం మేర నులిపురుగుల మాత్రలు పంపిణీ చేపట్టామని వైద్యులు తెలిపారు. మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణా దినోత్సవం సందర్భంగా వీటిని పంపిణీ చేశామన్నారు. బొద్దాం ఎంపీపీ పాఠశాలలో వైద్యులు బి.నరేంద్ర ఆల్‌బెండజోల్ ఆవశ్యకత వివరించి, చేతులు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు రవికుమార్, కె.ఈశ్వరరావు, హెచ్ఎం ఎస్.పైడిరాజు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నివారణకు కృషి చేయాలి

- తెర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారిణి దీక్షితారాణి



బొబ్బిలి రూరల్: క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న సచివాలయ, వైద్యారోగ్య సిబ్బంది



తెర్లాం: క్షయవ్యాధితో బాధపడుతున్న అప్పారావుకు పౌష్టికాహారం అందిస్తున్న దీక్షితారాణి, సీహెచ్ఓ భాస్కరరావు

తెర్లాం: క్షయవ్యాధి నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి దీక్షితారాణి కోరారు. ప్రధానమంత్రి టీబీ ముక్తా భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక పీహెచ్‌సీలో క్షయ వ్యాధిగ్రస్తులకు దాతలు సమకూర్చిన పౌష్టికాహారాన్ని మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయవ్యాధిని సంపూర్ణంగా నివారించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతగానో కృషి చేస్తున్నాయన్నారు. గతంలో కన్నా ప్రస్తుతం వ్యాధిగ్రస్తుల సంఖ్య చాలావరకు తగ్గిందన్నారు. వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందించేందుకు దాతలు, ప్రజాప్రతినిధులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. బూరిపేటకు చెందిన పూడివలస అప్పారావు అనే క్షయ వ్యాధిగ్రస్తుడికి 6 నెలల పాటు పౌష్టికాహారం అందించేందుకు ఎంపీపీ ఉమాలక్ష్మి ముందుకువచ్చారు. ఈ క్రమంలో అప్పారావు కోసం సమకూర్చిన గుడ్లు, పాలును ఆమె వ్యాధిగ్రస్తుడికి అందజేశారు. కార్యక్రమంలో బాడంగి టీబీ యూనిట్ పర్యవేక్షకులు బి.రమేష్, సీనియర్ ట్రీట్‌మెంట్ ల్యాబ్ సూపర్‌వైజర్ బలరాం నాయుడు, సీహెచ్ఓ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి రూరల్: మండలంలోని పెంట గ్రామంలో టీబీ నిర్మూలనపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. సచివాలయ కార్యదర్శి రవీంద్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్యారోగ్య సిబ్బంది పాల్గొని, టీబీ(క్షయ) బారినపడకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

రోజుకు రూ.257 వేతనం



వేతనదారులకు సూచనలిస్తున్న ఏపీఓ హరనాథ్

రేగిడి: మండలంలోని అప్పాపురం పంచాయతీ, మజ్జిరాముడుపేట గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీఓ ఎస్.హరనాథ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. జాబ్‌కార్డు ఉన్న వారిని మాత్రమే పనులకు అనుమతించాలని, పనులు చేస్తున్న వారికే మస్తర్లు వేయాలని సూచించారు. ఎండ తక్కువగా ఉన్న సమయాల్లోనే పనులు చేయాలన్నారు. రెండుపూటలా నిర్దేశిత కొలతల్లో పనులు చేస్తే రోజుకు రూ.257 వేతనం లభిస్తుందన్నారు. వేసవికాలం నేపథ్యంలో పని ప్రదేశంలో టెంట్లు, తాగునీరు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటరావు, మేట్లు తదితరులు పాల్గొన్నారు.

అంధులు అవకాశాలు అందిపుచ్చుకోవాలి



అంధ, బధిర విద్యార్థులతో జేడీ లక్ష్మీనారాయణ

- సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

విజయనగరం: దేశంలో అంధులకి, బధిరులకి, దివ్యాంగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక అవకాశాలను కలిపిస్తున్నాయని వాటిని అందుకోవడానికి మనో నిబ్బరంతో సిద్ధంగా ఉండాలని సీబీఐ మాజీ జేడీ వి.వి.లక్ష్మీనారాయణ అన్నారు. జేడీ ఫౌండేషన్ డెంకాడ మండలం డి.కొల్లాం ప్రతినిధులు కంటోన్మెంట్ గురజాడ పబ్లిక్ స్కూల్‌లో సారథి వెల్ఫేర్ అసోసియేషన్ అంధులకు మంగళవారం ఏర్పాటు చేసిన దుస్తులు, వంట సామాన్లు, పుస్తకాల వితరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా భారత మాత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చూపులేదని చింత పడకుండా మనో నేత్రంతో సమాజంలోని రుగ్మతలను గుర్తించి అందరూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. సారథి వెల్ఫేర్ అసోసియేషన్ విద్యార్థులకు తమ జేడీ ఫౌండేషన్ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ సైనికులు ఉంగ ఆదినారాయణ, లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి, జిల్లా సైనిక్ వెల్ఫేర్ అధికారి మజ్జి కృష్ణారావు, గురజాడ స్కూల్ కరస్పాండెంట్ స్వరూప పాల్గొన్నారు.

నిర్దేశిత లక్ష్య సాధనకు కృషి

బాడంగి: వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా 2022–23 ఏడాదికి సంబంధించి, నిర్దేశిత లక్ష్య సాధనకు కృషి చేస్తున్నామని వెలుగు కార్యాలయ ఏపీఎం పి.భాగ్యలక్ష్మి తెలిపారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో విలేకరులతో ఆమె మాట్లాడుతూ మండలంలో మొత్తం 1,262 పొదుపు సంఘాలున్నాయని, వీటిలో 949 సంఘాలు బ్యాంకు లింకేజీకి అర్హత సాధించాయని పేర్కొన్నారు. వీరికి ఏప్రిల్‌లో రుణ మాఫీ డబ్బులు ఖాతాల్లో జమ అవుతాయన్నారు. స్త్రీనిధి ద్వారా ఈ ఏడాది మార్చి నెలాఖరుకు రూ.6.55 కోట్లు రుణ లక్ష్యం కాగా ఇప్పటివరకు 95 శాతం చేరువైనట్లు వెల్లడించారు. బ్యాంకు లింకేజీల ద్వారా రూ.28 కోట్ల రుణ లక్ష్యం కాగా రూ.25 కోట్లు ఇప్పించినట్లు వివరించారు. పీఎస్ఈజీసీ కింద 23 యూనిట్లు నమోదు కాగా వీటిలో 108 సంబంధించి, గ్రౌండింగ్ జరిగిందన్నారు. ఈ నెలాఖరులోగా మిగిలిన లక్ష్యాలు పూర్తి చేస్తామన్నారు.

డీఎల్‌పీఓ పరిశీలన



మ్యాపు ఆధారంగా భూముల వివరాలపై ఆరాతీస్తున్న డీఎల్‌పీఓ మోహనరావు

బొబ్బిలి రూరల్: మండలంలోని ఎం.బూర్జవలస గ్రామసచివాలయంలో గ్రామకంఠం, ప్రభుత్వ భూముల వివరాలను డీఎల్‌పీఓ(డివిజనల్ పంచాయతీ అధికారి) ఆరిశెట్టి మోహనరావు మంగళవారం పరిశీలించారు. మ్యాపు ఆధారంగా పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి, ఎంపీడీఓ అల్లు భాస్కరరావులను అడిగి భూముల వివరాలపై ఆరాతీశారు. అనంతరం గ్రామంలోని చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి, చెత్త సేకరణపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.

పారిశుద్ధ్య నిర్వహణపై ఎస్‌డీసీ ఆరా



వైద్యులను అడిగి వివరాలు తెలుసుకుంటున్న ఎస్‌డీసీ బృంద సభ్యులు

రాజాం సిటీ: స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రిలో పారిశుద్ధ్య నిర్వహణపై ఎస్‌డీసీ బృందం సభ్యులు ఆరాతీశారు. మంగళవారం ఆస్పత్రికి చేరుకున్న బృంద సభ్యులు ఆస్పత్రి అంతా కలియతిరిగారు. బాత్‌రూంలతో పాటు వార్డులు అస్తవ్యస్తంగా ఉండడంతో సిబ్బంది పనితీరు పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బృంద సభ్యులు నరసింహం మాట్లాడుతూ కాయకల్ప్‌లో భాగంగా ప్రతీ ఆస్పత్రిని పరిశీలించి, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని తెలిపారు. తద్వారా ఆస్పత్రులకు ర్యాంకుల కేటాయింపు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ జీవీ రాజ్యలక్ష్మి, వైద్యులు పాల్గొన్నారు.

ఎండాకాలం.. జాగ్రత్తలు తప్పనిసరి



పీహెచ్‌సీ వైద్యాధికారి అసిరినాయుడు

రేగిడి: ఎండాకాలంలో అందరూ తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని, లేకపోతే అస్వస్థత బారినపడే ప్రమాదం ఉందని పీహెచ్‌సీ వైద్యాధికారి జి.అసిరినాయుడు హెచ్చరించారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో విలేకరులతో మాట్లాడిన ఆయన గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎండలో ప్రయాణించేటప్పుడు గొడుగు, వాటర్ బాటిల్ వెంట తీసుకుని వెళ్లాలన్నారు. ఎండలకు శరీరంలోని నీరంతా బయటకు పోతుందని, ఈ క్రమంలో తక్షణ శక్తి కోసం నిమ్మరసం, పంచదార నీరు, జ్యూస్‌లు వంటివి తీసుకోవాలన్నారు. డయేరియా బారినపడిన వారంతా వైద్యారోగ్య సిబ్బందికి సమాచారం ఇచ్చి, వైద్య సేవలు పొందాలన్నారు. ప్రస్తుతం ఏఎన్ఎంలు, ఆశవర్కర్లతో ప్రతిరోజూ గ్రామాల్లో ఇంటింట ఫీవర్ సర్వే చేయిస్తున్నామన్నారు. పీహెచ్‌సీలో అవసరమైన మందులు, అత్యాధునిక ల్యాబ్‌లు ఉన్నాయని, ప్రజలు పీహెచ్‌సీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పక్కాగా సోషల్ ఆడిట్



సోషల్ ఆడిట్ బృందానికి సూచనలిస్తున్న ఎంపీడీఓ శంకరరావు

రాజాం: మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించి, పక్కాగా సోషల్ ఆడిట్(సామాజిక తనిఖీ) నిర్వహించాలని ఎంపీడీఓ బాసూరి శంకరరావు సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోషల్ ఆడిట్ బృందంతో సమావేశమైన ఆయన ఆడిట్ విషయమై కాసేపు చర్చించారు. 2021 ఏప్రిల్ నుంచి 2022 మార్చి 31 వరకు జరిగిన పనులపై సోషల్ ఆడిట్ చేయడం జరుగుతుందని తెలిపారు. వేతనాల మొత్తం రూ.9,52,94,399తో పాటు మెటీరియల్ పనుల కోసం కేటాయించిన రూ.2,53,36,818 కలిపి మొత్తం రూ. 13,04,31,358 వ్యయంపై ఈ ఆడిట్ జరుగుతుందని పేర్కొన్నారు. 20 పంచాయతీల్లో ఈ ఆడిట్ ఉంటుందన్నారు. వివాదాలకు తావులేకుండా గ్రామాల వారీగా క్షేత్ర స్థాయిలో పరిశీలనలు చేయాలని, ప్రజావేదికలు నిర్వహించాలన్నారు. సోషల్ ఆడిట్ ఎస్ఆర్‌పీ అప్పలనాయుడు గ్రామస్తులు సోషల్ ఆడిట్‌కు సహకరించాలని కోరారు. అక్రమాలు గుర్తించేందుకు ఈ సామాజిక తనిఖీలు ఉపయోగపడతాయన్నారు. రెండు రోజుల్లో తమ బృందం గ్రామాల్లో తనిఖీలు నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపీఓ సాయిరాం, డీఆర్‌పీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



తెర్లాం: విజయరాంపురంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్న వీఏహెచ్ఏలు

తెర్లాం: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి జె.నరేంద్ర సూచించారు. మంగళవారం మండలంలోని నందిగాం, విజయరాంపురం రైతు భరోసా కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమాన్ని పరిశీలించిన ఆయన ఈ సీజన్‌లో పశువులకు గాలికుంటు వ్యాధి సోకే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో పాడి రైతులంతా తమ దగ్గరున్న పశువులకు తప్పనిసరిగా నివారణ టీకాలు ముందస్తుగా వేయించాలని తెలిపారు.

రూ.2.70 లక్షలకు పూజాసామగ్రి వేలం



నవదుర్గమ్మ ఆలయం

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్ ఆవరణలోని నవదుర్గ, జ్ఞానసరస్వతీదేవి ఆలయాల్లోని పూజాసామగ్రి విక్రయానికి వేలం ఖరారైందని ఈఓ పి.శ్యామలరావు తెలిపారు. మంగళవారం ఆలయ ఆవరణలో దేవదాయశాఖ తనిఖీదారు పీవీ లక్ష్మి సమక్షంలో నిర్వహించిన వేలంపాటలో ఏడుగురు పాటదారులు పాల్గొన్నారు. ఆలయం దగ్గర పూజా సామగ్రి సెట్లు, పుస్తకాలు, రక్షాబంధనములు, అమ్మవారి లామినేషన్ ఫొటోలు అమ్ముకునేందుకుగాను చేపట్టిన ఈ వేలంను సంతకవిటి మండలంలోని తలతంపర గ్రామానికి చెందిన రాగోలు ఆనందరావు ఏడాదికి గాను రూ.2.70 లక్షలకు దక్కించుకున్నారు. రెండో ఏడాది పది శాతం పెంపుపై అదే వ్యక్తికి ఉంటుందని ఈఓ తెలిపారు. మొత్తం ఈ నెల 30 నుంచి 2025 మార్చి 29వ తేదీ వరకు గడువు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త వానపల్లి నర్సింగరావు, సిబ్బంది పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి



స్టడీ అవర్‌లో విద్యార్థులు

రేగిడి: పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని ప్రిన్సిపాల్ బి.బుచ్చిరాజు తెలిపారు. మంగళవారం మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాలలో ఉదయం, సాయంత్రం విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులపై ప్రిన్సిపాల్ ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన చదువులో వెనకబడిన విద్యార్థుల ఉత్తీర్ణతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అలాగే మిగతా విద్యార్థులంతా సబ్జెక్టులో పట్టు సాధించేందుకు పదేపదే రివిజన్ చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు కూడా ఎప్పటికప్పుడు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయాలన్నారు.

వైభవంగా మారువారాల సంబరాలు



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



పోలమ్మతల్లి ఆలయం వద్ద భక్తుల పూజలు

బొబ్బిలి రూరల్: మండలంలోని పారాది గ్రామంలో మారువారాల సంబరాలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులంతా కొత్తపోలమ్మ, పాతపోలమ్మ గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. పసుపు, కుంకుమ, చీరలు, గాజులు, కోళ్లు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.

సొంత నిధులతో పాఠశాల పైకప్పు సీలింగ్



రంగప్పవలస ప్రాథమిక పాఠశాలలో ఓ తరగతి గది పైకప్పుగా ఉన్న రేకులు



సర్పంచ్ చొరవతో ఫాల్ సీలింగ్ వేసిన తర్వాత ఇలా..

తెర్లాం: సొంత నిధులతో తన గ్రామంలోని పాఠశాల పైకప్పు సీలింగ్ ఏర్పాటు చేసినందుకు గాను సర్పంచ్ శనపతి రాంబాబును అందరూ అభినందిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని రంగప్పవలస ప్రాథమిక పాఠశాలలో మనబడి నాడు-నేడు పథకం కింద గతేడాది ఓ తరగతి గది పైకప్పుగా రేకులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వేసవి కావడంతో ఎండలకు రేకులు విపరీతంగా వేడెక్కిపోతున్నాయి. దీంతో ఉక్కపోతతో తరగతిలో విద్యార్థులు కూర్చోలేని దుస్థితి నెలకొంది. ఈ విషయం తెలుసుకున్న సదరు సర్పంచ్ రూ.30 వేలతో ఫాల్‌సీలింగ్ చేయించారు. ఇప్పుడు తరగతి గది చల్లగా ఉందని, హాయిగా పాఠాలు వింటున్నామని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.